కథా కౌముది

# శ్రేయోభిలాషి

శెట్టిపల్లి అరుణా ప్రభాకర్

అరేయ్ మై డియర్ ఫ్రెండూ,

నీకిలా ఉత్తరం రాయగలుగుతానని కలలో కూడా అనుకోలేదురా. నాకసలు లోకజ్ఞానం ఏమీ లేదా, నువ్వు ఆప్త మిత్రుడివి కాబట్టి దగ్గరుండి అన్నీ నేర్పించావా, పేకముక్క మొహం చూడని నాతో పేకమేడలు కట్టించావా, కూల్డ్రింక్ ఎరుగని నన్ను విస్కీలో ముంచావా – ఇవన్నీ అయ్యాక, ఇదిగో ఇలా ఆరోగ్యం చెడి హరీమని ఇక్కడ నరకానికి వచ్చి పడ్డా!! నా ప్రాణాలు పైకి పోతుంటే 'నేర్పించినోడు బాగానే ఉన్నాడు, మా ఆయనకే వచ్చింది రోగం' అని మా ఆవిడ ఏడుపు వినబడుతూనే ఉంది.

నరకం నుంచి ఉత్తరం ఎలా రాస్తున్నాను అనేది తరువాత చెప్తాను.

అంతకన్నాముందు ముఖ్యమైన విషయం, ఆప్త మిత్రుడివి కాబట్టి చెబుతున్నా. ఈ స్వర్గం, నరకం అన్నీ ఉత్త ట్రాష్, అవెక్కడేడ్చాయి అనుకునే వాళ్ళం కదా! అలా కాదురా. స్వర్గం ఉంది, నరకం ఉంది, వైతరణీ ఉంది. ఇక్కడ వీళ్లు పెట్టే బాధలు భరించలేక పోతున్నారా. కుంభీపాకమూ, క్రిమి భోజనమూ, రౌరవమూ ఇంకా నానా పేర్లు గల నరకాలు, శిక్షలూ అన్నీ ఉన్నాయిరా బాబూ. చిత్రమేమిటంటే చచ్చాక ఆత్మకు నొప్పేమిటి అనుకున్నాం గానీ అన్నీ ఉన్నాయి.

ఎటొచ్చీ వీళ్ళెన్ని చిత్రహింసలు పెట్టినా ప్రాణం పోయి చావదు. ప్రాణస్నేహితుడివి కదా ముందు తెలుసుకుంటే నువ్వయినా జాగ్రత్త పడతావని ఈ ఉత్తరం రాస్తున్నా. ఇక ఈ ఉత్తరం రాసి నీకందజేసే అవకాశం ఎలా వచ్చిందో చెప్తా.

నేను పైకొచ్చిన కాస్సేపటికే పాపం మా ఆవిడా పైకొచ్చేసిందట. యమధర్మరాజు దగ్గర లైన్లో నా వెనకాల ఆమె కూడా ఉందట. అయితే ఈ విషయం మాకిద్దరికీ తెలియదు. నా వంతు వచ్చేసరికి యమధర్మరాజు నాకు నరకం అన్నాడు. మనం చేసిన పాపాలు తక్కువా మరి!. ఇక మా ఆవిడకేమో స్వర్గం దొరికింది. పుణ్యాత్మురాలుకదా పాపం. స్వర్గానికెళ్ళాక 'మా ఆయనేడీ?' అని అడిగిందట. మన ఆధార్ కార్డు లాంటి సిస్టమేదో వాళ్ళకీ ఉన్నట్టుంది. నా ఆచూకీ కనిపెట్టి 'అమ్మీ, మీ ఆయన నరకంలో ఉన్నాడు' అని చెప్పారట. అంతే! నానా గొడవా చేసిందట. 'నేనిక్కడుంటే మా

ఆయన నరకంలో ఏమిటి, రప్పించండ'ని. పాపం, నేనంటే చాలా ఇష్టం రా. నేనే దాన్ని నిర్లక్ష్యం చేశాను. రూల్స్ ఒప్పుకోవని ఎంత చెప్పినా వినలేదట.

ఇక దాని గోల పడలేక ఒకసారి చూసి రమ్మని ఓ రథమూ, ఓ సారథినీ ఇచ్చి ఇక్కడికి పంపించారు. ఇక్కడ నన్నూ, నాకు వేస్తున్న శిక్షలనూ చూసి వలవలా ఏడ్చింది. 'మా ఆయన్ని పంపండి నా వెంట స్వర్గానికి తీస్కెళ్తా' అని యమధర్మరాజుతో పెద్ద పేచీ. ఆయనకు సావిత్రి దిగివచ్చినంత పనైంది.

ఈ ఆడవాళ్ళు అసాధ్యులురా బాబూ. చివరికి వాళ్లే ఏదో రూల్స్ అమెండ్మెంట్ లాంటిది చేసుకుని అదే రథంలో దాని వెంట నన్ను స్వర్గానికి పంపించే ఏర్పాటు చేశారు. అదిగో అప్పుడొచ్చింది నాకీ ఆలోచన. ఈ నరకమూ, శిక్షలూ వగైరాలు నిజంగా ఉన్నాయని నీకు తెలియజేస్తే జాగ్రత్తపడతావని. కానీ మార్గం లేదే. అదే విషయం మా ఆవిడతో చెప్తే 'చూద్దాం, దానికేం భాగ్యం' అని అక్కడే భూలోకానికి బయల్దేరుతున్న యమభటులు ఇద్దరు కనిపిస్తే పిలిచింది, 'అబ్బాయ్, ఓ ఉత్తరం ముక్క ఉంది. ఫలానా వారి కివ్వాలి' అని. ఈవిడ ప్రతాపం చూసి ఉన్నారు కాబట్టి వాళ్ళిద్దరూ మొహాలు చూసుకున్నారు. 'అదేందయ్యా, ఆమాత్రం చేయలేరా ఏంటి?' అన్నది మా ఆవిడ.

అప్పుడు చెప్పారు 'అమ్మా, ఉత్తరం ఇవ్వడానికి మాకేం అభ్యంతరం లేదు గానీ మేము ఎవరికైనా కనిపించామూ అంటే వారికి ఇంక నూకలు చెల్లినట్టే' అని. 'అంటే ఉత్తరం చదివే టైమ్ కూడా ఉండదా?' అన్నది మా ఆవిడ. 'దానికేం తల్లీ, ఉత్తరం చదవొచ్చు కానీ అకాల మరణం...' అన్నారు.

'అయితే ఆయనగారి అసలు చావెపుడో ఓ సారి మీ లిస్ట్ లో చూసి చెప్పు' అన్నది మా ఆవిడ వాళ్ళ చేతుల్లో ఉన్న చిట్టాలు గమనించి. వాళ్ళు ఆ చిట్టాలన్నీ వెదకి నీ పేరు పట్టుకున్నారు.

'తల్లీ, మేం గనక ఈ ఉత్తరం ఆయనకి అందిస్తే ఆయన అసలు టైమ్ కంటే పావుగంట ముందే పోతాడమ్మా' అని నసుగుతూ చెప్పారు.

'ఓస్ ఇంతేనా. వీళ్ళు పేకాటల్లో, మందు పార్టీల్లో రోజులు రోజులే తగలేశారు. ఓ పావుగంట తగ్గితే ఏం పోయింది' అన్నది మా ఆవిడ.

'అట్లా కాదు తల్లీ , మాలెక్కలో పావుగంట అది. మీ లెక్కలో పదిహేను సంవత్సరాలమ్మా' అన్నారు వాళ్ళు.

'మరేం పర్లేదు లెండి. మా ఆయన ఉత్తరం రాస్తారు. మీరు పట్టుకెళ్ళి ఆయనకి ఇచ్చెయ్యండి' అని మొత్తానికి యమభటులని ఒప్పించిందిరా మా ఆవిడ. గట్టి పిండం కదూ!. ఇదిగో ఇలా అవకాశం వచ్చిందని నీకీ ఉత్తరం పంపిస్తున్నా. జాగ్రత్త! మళ్ళీ మనం కలుస్తామో లేదో. ఇక ఉంటా." _ _ _ _ _ ఇట్లు నీ ప్రియ మిత్రుడు.

COMMENTS